క్లాసులో కూర్చున్న దన్న మాటే కాని, తన మనసు మనసులో లేదు. సరోజినీ టీచరు పాఠం చెప్పుకు పోతూంది. మిగతా విద్యార్థినులందరూ బుద్ధి మంతుల్లా శ్రద్ధగా వింటున్నారు. తనకు మాత్రం పాఠం ఇసుమంతకూడా అర్థం కావటం లేదు. తన ఆలోచనలన్నీ నాన్న గురించే. నాన్న అమ్మను ఏం బాధలు పెడుతున్నాడో!

"పారిశ్రామిక విప్లవం ఎప్పుడు వచ్చింది?" హఠాత్తుగా ప్రశ్నించింది సరోజినీ టీచరు. ఎవరైనా పరధ్యానంగా కనిపిస్తే వారిని ప్రశ్నలడగటం సరోజినీ టీచరుకు అల వాటు. ఒక్క సరోజినీ టీచరుకే కాదు సాధారణంగా టీచర్లందరికీ ఇది సహజమే నేమో!

హఠాత్తుగా అడగటంతో తను కంగారుపడిపోయింది. నోటికి వచ్చిన జవాబు చెప్పింది. అంతే. క్లాసులో విద్యార్థినులందరూ గొల్లుమని నవ్వారు.

"సైలెన్స్. . . సైలెన్స్" రెండు సార్లు టేబుల్ మీద డస్టరుతో కొట్టింది టీచరు.

క్లాసంతా నిశ్శబ్దం.

సిగ్గనిపించింది. ఎప్పుడూ జవాబులు చెప్పటంలో చురుకుగా ఉండే తను, ఈ రోజు పరధ్యానంగా ఉండటం వల్ల తప్పు జవాబు చెప్పింది. తెలీదు అని చెప్పినా సరిపోయేది. తనకే చిన్నతన మనిపించింది.

"సారీ, టీచర్, తలనొప్పిగా ఉంది. ఇంటికి వెడతాను." లేచి నిలుచుని అన్నది తను.

"వెళ్ళమ్మా!" పర్మిషన్ ఇచ్చింది టీచరు.

క్లాసులో బాగా చదువుతుందని తనకు మంచి పేరు ఉంది. మంచి మార్కులు వస్తాయని సరోజినీ టీచరుకు తనంటే ప్రత్యేకమైన అభిమానం.

పుస్తకాలు తీసుకుని క్లాసులో నుంచి బయటకు వచ్చింది తను.

స్కూలు గేటు దాటి రోడ్డు మీదికి వచ్చేసరికి, "రిక్షా ఎక్కుతారా, అమ్మా?" అని రోడ్డు వెంట పోతున్న రిక్షా అతను అడిగాడు.

అవసరం లేదన్నట్లు తల అడ్డంగా ఊపి, పుస్తకాలు ఎడమచేత్తో గుండెలకు ఆనించుకుని రోడ్డు వారగా నడుస్తున్నది. నడుస్తున్నదన్న మాటే కాని, ఆలోచనలు మళ్ళీ నాన్న మీదకు మళ్ళాయి.

నాన్నది అదొక రకమైన వింత మనస్తత్వం. తను నమ్మిన వాటన్నింటినీ ఎదుటివారు కూడా నమ్మాలంటాడు. ఆయనకు జ్యోతిషం మీద ఎవరికీ లేనంత నమ్మకం ఉంది. ఆ జ్యోతిషమే, దానిమీద నాన్నకు ఉన్న విపరీతమైన నమ్మకమే తమ ఇంట్లో ఎప్పటినుంచి అశాంతిని రేపింది. అనుక్షణం అమ్మ కన్నీటి జల్లుకు కారణమయింది. నాన్న వ్యవహారంతో సంచలనాన్ని కలిగించింది, తన పసి మనసుతో ఎండా చేసింది.

నిన్న ఉదయం తమ ఎదురు పెంకుటింట్లో ఉంటున్న అవధాన్లుగారు తమ ఇంటికి వచ్చారు. ఆయన ఇంటికి ఎవరో సిద్ధాంతి వచ్చాడట. భగవద్గీత చదువుతుంటున్న నాన్నతో "రావోయ్, గురుమూర్తీ, చెయ్యి చూపించుకుందువు గాని. . జాతకం కాగితం కూడా ఉంటే తీసుకురా — మరీ మంచిది" అని చెప్పారు అవధాన్లుగారు. ఇంకేముంది? నాన్న ఎగిరి గంతేసి ట్రంకుపెట్టెలో అడుగున ఉన్న తన జాతకం కాగితం తీసుకుని అవధాన్లుగారి వెంట వారింటికి వెళ్ళాడు.

గంట తరవాత ఇంటికి తిరిగి వచ్చిన నాన్న ముఖంలో విచారం ద్యోతక మవుతూంది.

## ప్రతాప రవిశంకర్

"ఏమిటండీ అలా ఉన్నారు?" అడిగింది అమ్మ.

"కాముడూ! నీ కో విషయం చెబుతాను—నమ్ముతావా?" అడిగాడు నాన్న.

"చెప్పండి."

"చెప్పమంటే కుదరదు. నమ్మి తీరాలి."

సరే అన్నది అమ్మ.

ఇంకేముంది— ఈ విషయం చెప్పాడు నాన్న. అసలు నాన్న ఈ వార్త చెబుతాడని తను అనుకోలేదు, అమ్మ ఊహించనే లేదు. ఎవరు మాత్రం ఊహిస్తారు ఇటువంటి దుర్వార్తను? "ఇంకో పది రోజుల్లో నేను చచ్చిపోతాను, కాముడూ!" నాన్న గొంతులో నైరాశ్యం ధ్వనిస్తూంది.

అవాక్కయి పోయింది అమ్మ. నమ్మలే నట్లుగా నాన్న వైపు చూసింది భయంగా.

"నిజం, కాముడూ, నేను చెబుతున్నది నూటికి నూరు పాళ్ళు నిజం. ఆ సిద్ధాంతి ఎంతో గొప్పవాడు. ఆయనకు మంచి పేరుంది. జ్యోతిశ్శాస్త్రమంతా తిరగవేసిన వ్యక్తి. నా జాతకం చూసి, చెయ్యి చూసి ఆయన చెప్పాడు— ఇంకో పది రోజుల్లో నాకు ఈ లోకంతో ఋణం తీరిపోతుంది." ఇంకా ఏవేవో చెప్పుకు పోతున్నాడు నాన్న వేదాంతం పలుకుతూ.

"చాలు. ఇంక ఊరుకోండి. . . మీరు నూరేళ్ళు బ్రతుకుతారు" అమ్మ కనుల్లో భయం తాలూకు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"నా మాట నమ్మనట్లే అంటున్నావు, కాముడూ! నిజం నాకు తెలుసు పిచ్చిదానా! ఈ భూమిమీద నాకు నూకలు చెల్లాయి. వెళ్ళిపోతాను. ఇప్పుడు ఈ సిద్ధాంతి చెప్పటమే కాదు, ఇరవై ఏండ్ల క్రితం ఒక బైరాగి నా చెయ్యి చూసి చెప్పాడు—అరవయ్యో ఏట దాటేసరికి నాకు ఋణానుబంధం తీరిపోతుందని. సరిగ్గా పది రోజుల్లో అరవై దాటుతాయి. నిజం, కాముడూ, ఇది నిజం."

నాన్న మాటలు అమ్మ ఇక వినలేక వంటింట్లోకి వెళ్ళిపోయింది. అమ్మ కనుల వెంట కన్నీటిచుక్కలు. అమ్మ ఎంత బాధ పడిపోయిందో నాన్న మాటలు వింటుంటే! గుండె చెరుక్కుపోయి ఉంటుంది. అవును. ఏ భార్యకు బాధగా ఉండదు—తన భర్త ఇంకొక పది రోజుల్లో తనని వదిలి శాశ్వతంగా వెళ్ళిపోతున్నాడంటే. తను నమ్మనీ, నమ్మకపోనీ. ఆ తలంపు ఊహించటానికే ఎంత కఠోరంగా ఉంటుంది? ఎంత క్రూరంగా ఉంటుంది? ఎంత భయంకరంగా ఉంటుంది?

సాధారణంగా జ్యోతిషంలో లక్ష రూపాయలు లాటరీలో వస్తాయని చెబితే నమ్ముతారు. ఆకస్మికంగా బంధువుల ఆస్తి కలిసివస్తుందని చెప్పినా నమ్ముతారు. జీవితంలో నాలుగు పెండ్లిండ్లు జరుగుతాయని చెప్పినా సులభంగా నమ్ముతారు. కాని, త్వరలోనే చావబోతున్నాడని ఏ సిద్ధాంతి చెప్పినా, ఎంతగా జ్యోతిషం మీద నమ్మకం ఉన్న మనిషయినా నమ్మడు. జ్యోతిషంలో అంతా జరగదు. కొంత జరుగుతుందని అంటాడు.

కాని, నాన్న అందరి లాంటి మనిషి కాడు. జ్యోతిషాన్ని పూర్తిగా నమ్ముతాడు. తన జీవితం ఇప్పటివరకూ తన జాతక ఫలాన్ననుసరించే జరుగుతూందని ఆయన చాలా సార్లు అన్నాడుకూడా. అందుకే నాన్నకు తను పది రోజుల్లో చచ్చిపోతా డని అంత గట్టి నమ్మకం.

ఆ నమ్మకంతోనే తను పోయిన తరవాత తన తోడులేని అమ్మ బ్రతుకును ఊహించుకుని, "కాముడూ! ఇన్ని రోజులూ కష్టసుఖాల్లో కలిసి బ్రతికాం. ఇప్పుడు నేను చచ్చిపోతే నువ్వు బ్రతక గలవా?" అని అమ్మను పదేపదే మరీ అడుగుతుంటే అమ్మ ఏమని చెప్పగలదు, కన్నీరు నిండిన కంటితో చూడటం తప్పితే?

ఆ దీనమైన చూపుల అర్థం చేసుకోడు నాన్న. ఆ చూపు వెనక దాగి ఉన్న అమ్మ భయాన్ని గ్రహించలేడు. 'మీరు లేకుండా నేను బ్రతకలేనండీ' అన్న అమ్మ చూపులోని భావాన్ని గ్రహించ లేడు.

పాపం! నాన్న గొడవ నాన్నది. ఆయన ఆలోచనలు ఆయనవి. తన ఆలోచనలన్నీ అమ్మతో చెబుతుంటే, ఆ స్త్రీ హృదయం ఎంతవరకు తట్టుకోగలదు?

అమ్మ కుమిలి కుమిలి ఏడిచింది.

పాపం! నాన్న మళ్ళీ తన చావు కబుర్లు చెప్పి అమ్మ మనసును ఎంత బాధ పెడుతున్నాడో!

ఆలోచనల నించి తేరుకుని ఇంట్లోకి నడిచింది. నాన్న అప్పుడే బజారు నుంచి వచ్చాడేమో లాల్చీ విప్పి దండెం మీద వేస్తున్నాడు.

అమ్మ వంటింటి వాకిలి ఎదురుగా కూర్చుని వంకాయలు తరుగుతూంది.

పన్నెండు గంటలు కాకముందే స్కూలు నించి వచ్చిన తనని చూసి, "అప్పుడే వచ్చావేమమ్మా?" అని అడిగింది అమ్మ.

"తలనొప్పిగా ఉంటేనూ" అని చెప్పి, పుస్తకాలు టేబుల్ మీద ఉంచి అమ్మ దగ్గరకు వెళ్ళింది.

"నేను ముక్కలు తరుగుతానులే. నువ్వింకో పని చేసుకోవమ్మా" అన్నది తను, కత్తిపీట దగ్గర కూర్చుంటూ.

"వద్దులేమ్మా నేను తరుక్కుంటాను. తలనొప్పిగా ఉందన్నావుగా. అలమార్లో అమృతాంజనం ఉంది. కణతలకు రుద్దుకుని పడుకో" అన్నది అమ్మ.

అమ్మకి తనంటే ఎంత ప్రేమో! ఏ పని చెయ్యబోయినా—"ఎటు తిరిగి రేపు వెళ్ళినచోట చెయ్యాలిగా. ఇక్కడకూడా ఎందుకులే?" అంటుంది.

నిజంగా తలనొప్పిగా ఉంటే కదూ తనకు అమృతాంజనం రాసుకునేందుకు? వెళ్ళి గదిలో మంచం మీద పడుకుంది.

మళ్ళీ నాన్న అమ్మను పిలవటం తన చెవులకు వినిపించింది.

"కాముడూ!"

"ఊఁ" అన్నది అమ్మ.



నాన్న మళ్ళీ ఏదో మొదలు పెట్ట బోతున్నాడని అనుకుంది తను.

తను ఊహించినంతా జరిగింది.

ప్రస్తుతం నాన్న ఏది మాట్లాడినా తన చావు గురించే. తను పోయిన తరవాత తమ భవిష్యత్తు గురించే.

''నేను పోయిన'' తరవాత బొట్టు తీయించకుండుంటావు కదూ?'' అడిగాడు నాన్న.

''మళ్ళీ అవాచకం మాటలు మొదలు పెట్టారా?'' అమ్మ అంటున్నది.




"అవాచకం మాటలు కావు, కాముడూ, నిజంగా అడుగుతున్నాను. నాట్లు తీయించుకుంటావు గదూ?"

అమ్మ మాట్లాడలేదు.

"ఏడుస్తున్నావా, కాముడూ? ఎంత పిచ్చిదానివి! జాతస్య మరణం ధ్రువమ్. ఏదో ఒక రోజు ఈ ప్రాణం అనంత వాయువుల్లో కలియక తప్పదు కదా! ఏ రోజైతేనేం. కాకపోతే నేను ముందు, నువ్వు తరవాత. అంతే తేడా!"

"మీ రిట్లాగా నన్ను వేధించుకు తింటూంటే ఇంకొక్క క్షణంకూడా ఈ ఇంట్లో ఉండను. మా అన్నయ్యగారింటికి వెళ్ళిపోతాను." బాధగా అంటున్నది అమ్మ.

అమ్మ గొంతు వింటుంటే తనకూ బాధ అనిపించింది. తనకూ దుఃఖం ఆగలేదు. నాన్నకు ఏం భావ్యంగా ఉంది, అమ్మని ఇలా అనుక్షణం మాటలతో చిత్రవధ చెయ్యడం?

"పిచ్చి కాముడూ! నేను చచ్చిపోతా నంటే ఎంత భయం నీకు! అవునులే. ఇన్నాళ్ళూ పచ్చటి పసుపు కుంకుమలతో మహాలక్ష్మిలా వెలుగుతున్న నీ రూపు నా చావుతో వెలవెల బోతుంది. జుత్తు తీసేస్తారు. గాజులు వేసుకోవటానికి వీల్లేదు. పాదాలకు పసుపు రాసుకునేందుకు వీల్లేదు. నాకే భయంభయంగా ఉంది, కాముడూ, నేను పోయిన తరవాత నీ రూపు ఎట్లా ఉంటుందో ఊహించుకుంటే!"

'నాన్నా!' పెద్దగా అరుద్దామనిపించింది. కాని, ఎందుకో అరవలేకపోయింది. నాన్నను మందలించేటంతటి చనువు తనకు లేదు. మొదటినించీ తనకు అమ్మ దగ్గరే ఎక్కువ మాలిమి. ఏ రోజూ నాన్న తనను ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నట్లు గాని, తన ఒడిలో కూర్చోపెట్టుకుని కబుర్లు చెప్పినట్లు గాని తనకు గుర్తు లేదు. అంతమాత్రాన నాన్నకు తన మీద ప్రేమ లేదని కాదు. ఏమిటో నాన్న తత్త్వమే అంత.

నాన్న మాటలు వింటుంటే ఆ మాటలు భరించలేక అమ్మ ఆత్మహత్య చేసుకుంటుందేమో అనిపించింది.

నాన్న మళ్ళీ ఏదో మాట్లాడబోతున్నాడు.

ఇంతలో శాస్త్రి మామయ్య వచ్చాడు. ఆయన తమకు బంధువు కాదు. బంధువుని మించిన ఆత్మీయుడు. నాన్నకు బాల్య మిత్రుడు. తమ కష్టసుఖాల్లో పాలు పంచుకుంటాడు. మంచి హృదయం కల మనిషి.

"రావోయ్, శాస్త్రీ, అలా కూర్చో." ఆహ్వానించాడు నాన్న.

"కులాసాయేనా, అన్నయ్యగారూ?" కుశల ప్రశ్నలు వేసింది అమ్మ.

"ఆ. . . అందరూ క్షేమంగానే ఉన్నారమ్మా. అన్నట్టు మా రెండో వాడికి బెజవాడ సంబంధం ఖాయపరుచుకుని వచ్చాను. పిల్ల బంగారుబొమ్మ. కట్నం కోసం ఆశపడలేదు. చక్కని గాత్రం ఉంది. అబ్బాయికీకూడా నచ్చింది. ముహూర్తాలుకూడా పెట్టుకున్నాం. వివాహం ఇంకో నెల రోజులు ఉంది." ఉత్సాహంగా చెబుతున్నాడు శాస్త్రి మామయ్య.

"నీ కొడుకు పెళ్ళి చూసే యోగ్యం నాకు లేదోయ్, శాస్త్రీ?" వేదాంతిలా అన్నాడు నాన్న.

"అదేం? !" ఆశ్చర్యంగా అడిగాడు శాస్త్రి మామయ్య.

"మీ అందరి నుంచి శాశ్వతంగా వెళ్ళిపోతున్నాను" అని అంతా వివరంగా చెప్పాడు నాన్న.

అంతా విని శాస్త్రి మామయ్య "ఎంత అమాయకుడివోయ్, గురుమూర్తీ? జోస్యాన్ని ఉన్నది ఉన్నట్టు ఎవ్వడూ చెప్పలేడు. పైగా జోస్యం అంతా జరగదు. జరిగే పాలు చాలా తక్కువ. నావ రాకడ, ప్రాణం పోకడ తెలుసుకోవటం ఎవరికి సాధ్యం? మనం మనుష్యులం గురుమూర్తీ! ఏ క్షణంలో ఏం జరుగుతుందో, ఈ ప్రాణం ఎప్పుడు పోతుందో ఎవరు చెప్పగలరు? అనవసరంగా నువ్వు భయపడి ఎదుటివారిని భయపెట్టకు. లక్షణంగా నా కొడుకు పెళ్ళి చూస్తావు." ధైర్యం చెప్పాడు.

"శాస్త్రీ! జోస్యాన్ని అవహేళనం చెయ్యకు. జోస్యం అంతా జరిగి తీరుతుంది. నీకొక విషయం చెబుతాను, విను. నాకు తెలిసిన ఒక మిత్రుడు ఉన్నాడు. ఆయనకు జోస్యం మీద అసలు నమ్మకం లేదు. ఒక రోజు ఆయన దగ్గరకు ఒక కోయవాడు వచ్చాడట. ఆయన వద్దన్నా వినకుండా జోస్యం చెబుతా నన్నాడట. ఆయన పెద్ద కుమారుడికి జోస్యం మీద నమ్మకం ఉంది. అతని చెయ్యి చూసి నెల రోజులలో చచ్చిపోతాడని చెప్పాడట. ఆ మాట విని నా మిత్రుడికి కోపం వచ్చి కోయవాడిని తన్ని బయటకు గెంటాడట. నెలరోజులు తిరిగేసరికి ఆయన పెద్ద కొడుకు గుండె ఆగి మరణించాడట. ఈ విషయం చెప్పి ఆయన నా ముందు కంటతడి పెట్టాడు. అంతదాకా ఎందుకు? నా పెద్ద కూతురు జానకి విషయంలో ఏం జరిగింది? మల్లాప్రగడ దాని చెయ్యి చూసి రెండో సంబంధం వాడిని చేసుకుంటుందని చెప్పలేదూ? అంతే జరిగింది కదా! ఇంకెక్కడోయ్, శాస్త్రీ, జోస్యంలో జరగకుండా ఉన్నది? మీరు నమ్మరు, శాస్త్రీ, జోస్యం అంతా జరిగి తీరుతుంది. ఒకటే మాత్రం నిజం, శాస్త్రీ! సిద్ధాంతి చెప్పిన రోజుకి నేను చావకపోతే ఒప్పుకుంటాను జోస్యం అంతా జరగదని." ఆవేశంగా అన్నాడు నాన్న.

"సరేలే. . . ఇక నే వెడతాను" అని వెళ్ళిపోయాడు మామయ్య.

పది నిమిషాల సేపు నాన్న మాట్లాడలేదు. ఏదో మౌనంగా ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"భోజనానికి రండి." పిలిచింది అమ్మ.

పడక కుర్చీలో నించి లేచి పట్టుబట్ట కట్టుకుని వెళ్ళి పీటమీద విస్తరి ముందు కూర్చున్నాడు నాన్న.

"నువ్వుకూడా రావే!" తననికూడా పిలిచింది అమ్మ. ఎందుకో తనకు అన్నం తినాలనిపించలేదు. "ఇప్పుడు రానులే. నీతో వస్తాను." చెప్పింది.

భోజనం చేస్తున్నంత సేపూ నాన్న అమ్మతో ఏమీ మాట్లాడినట్లు లేదు. దానిబట్టి ఆయన ఏదో విషయాన్ని గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు అనుకుంది.

భోజనం చేసి పట్టుబట్ట విప్పి, ధోవతి కట్టుకుని వచ్చి కుర్చీలో కూర్చున్నాడు నాన్న. భోజనం చేసి ఓ రెండు గంటలు నిద్ర పోవటం నాన్నకు అలవాటు. కాని, నిన్నటినించీ ఆయన సరిగా నిద్ర పోవటం లేదు. ఆలోచనలు నాన్నని ఊపిరి పీల్చుకోనివ్వటం లేదేమో!

"కాముడూ!" పిలిచాడు నాన్న.

"ఏమిటండీ?" వంటింట్లో నించి వచ్చింది అమ్మ.

"జానకి దగ్గరకు వెడదామనుకుంటున్నాను" అన్నాడు నాన్న.

నాన్న ఉద్దేశాన్ని గ్రహించినట్లుంది అమ్మ—మౌనంగా నిలుచుంది.

"మాట్లాడవేం?"

"మీరు వెళ్ళటం దేనికి? ఉత్తరం ముక్క రాస్తే అదే వస్తుందిగా!"

"పిల్లల్ని తీసుకుని అది ఇక్కడకు రావడం కంటే. . .నేనే అక్కడికి వెళ్ళటం

(తరువాయి 22 వ పేజీలో)

# చావు జోస్యం

(19వ పేజీ తరువాయి)

బాగుంటుంది కదూ? పైగా అల్లుడికి సెలవు దొరుకుతుందో, లేదో? అల్లుడిని చూసికూడా చాలా రోజులయింది.''

అమ్మ మాట్లాడలేదు.

ఆ సాయంత్రమే నాన్న అక్కయ్యగారి ఊరు వెళ్ళాడు.

నాన్న వెళ్ళిన తరవాత అమ్మ మనసు విప్పి తనతో చెప్పుకుంది. అమ్మ మాటలు వింటుంటే తనకు భయం వేసింది.

''నాకూ జోస్యం మీద నమ్మకం ఉంది, లక్ష్మీ! మీ నాన్న చెప్పింది నిజం. జానకికి అక్కయ్యను రెండో సంబంధానికి ఇచ్చి చేస్తామని ముందే తెలుసు. అట్లాగే జరిగింది కదా! ఇరవై ఏళ్ళ క్రితం ఒక రోజు మీ నాన్న చెప్పారు. . . ఎవరో బైరాగి తన చెయ్యి చూసి చెప్పాడట. అరవయ్యో ఏడు దాటుతుండగా తను చచ్చిపోతాడని. మీకు చాదస్తం జాస్తి అని ఆయన మాటలు కొట్టివేశాను. మళ్ళీ నిన్న ఈ సిద్ధాంతికూడా అదే మాట...'' ఈ మాటలు అంటున్నప్పుడు అమ్మ గొంతు జీరవోయింది.

''నా కెందుకో భయంగా ఉంది. ఆయన తరవాత నేను బ్రతకలేను. ఆయన బ్రతికి ఉండగానే పునిస్త్రీగా... పచ్చడు పసుపు కుంకుమలతో పోతే ఎంత అదృష్టం? ఎంతమందికో ఆ భాగ్యం.'' ఇంక తను అమ్మ మాటలు వినలేకపోయింది. ''అమ్మా. . . ఇంకెప్పుడూ ఇలా మాట్లాడకు. . . నువ్వు నాన్న మాటలు నమ్ముతున్నావా. . . నీ మాటలు వింటుంటే నా హృదయం కోసినట్లుగా ఉంది.'' విలపించింది తను అమ్మ ఒడిలో వాలిపోతూ.

''ఇంకెప్పుడూ నీ ముందు ఇట్లా మాట్లాడనులే, తల్లీ'' అన్నది అమ్మ, తనను గుండెలకు హత్తుకుంటూ.

రెండు రోజుల తరవాత నాన్న తిరిగి వచ్చాడు.

నాన్న ఇంట్లో లేని రెండు రోజులూ ఎంతో ప్రశాంతంగా ఉంది. ఇంట్లో ప్రశాంతంగానే ఉంది కానీ, అమ్మ గుండెలో మాత్రం గూడు కట్టుకున్న అశాంతి అలాగే నిలిచిపోయింది. అది రెండు రోజుల్లో తొలగిపోయే అశాంతి కాదు.

''కాముడూ! జానకి నా మాటలు నమ్మలేదు. పైగా హాస్యమాడింది. దానికి ఇదివరలో జోస్యమంటే నమ్మకమున్నట్లు జ్ఞాపకం. అది స్కూల్లో చదువుకునే రోజుల్లో పరీక్ష పాసవుతుందో, లేదో తెలుసుకోవటానికి చిలక జోస్యం చెప్పించుకునేది కదూ? ఇప్పుడు దానికి జోస్యం మీద అంతట నమ్మకంకూడా లేనట్లుంది. 'ఇంకా నీకు ఆ పిచ్చి వదలలేదా, నాన్నా?' అని అడిగింది. అల్లుడుకూడా అంతే. 'ఏమిటి, మామగారూ, ఈ చాదస్తం' అన్నాడు. ఆఖరికి పిల్లలుకూడా నాతో పరాచికాలాడారు. 'నువ్వు చచ్చిపోతున్నావా, తాతయ్యా' అని అడిగారు. ఇక అక్కడ నిలవలేకపోయాను.'' నాన్న చెబుతున్నాడు బాధగా.

అమ్మ మాట్లాడకుండా నాన్న వైపు చూస్తూ నిలుచుంది. నాన్న మాటలు వింటుంటే తనకుకూడా చాలా బాధ అనిపించింది. సిద్ధాంతి చెప్పిన రోజు రానే వచ్చింది.

అందరి గుండెల్లోనూ నెలకొన్న అశాంతి రెండింతలయింది. ఇక నాన్న సంగతి సరేసరి. రోజాకంటే ముందు గానే నిద్ర లేచాడు. నిద్రపోవటానికి అసలు నాన్న నిద్ర పోతేగా. ఈ పదిహేను రోజులనించి కంటినిండా కునుకు తీయలేదు. అసలు నిద్ర పట్టలేదు.

స్నానం చేసి సంధ్యావందనం గావించాడు. దేవుడి మందిరంముందు కూర్చుని ఏవో స్తోత్రాలు చదివాడు. ఊళ్ళో ఉన్న దేవాలయాలన్నిటికీ వెళ్ళి వచ్చాడు.

మిత్రులందరిళ్ళకు వెళ్ళి వారందరిని పరామర్శించి ఇదే చివరి చూపని, తనకి ఋణం తీరిపోయిందని ఈ భూమిమీద నూకలు చెల్లినాయని... ఇంకా ఎన్నో విషయాలు చెప్పాడు వారితో. వారిలో కొంతమంది నాన్న మాటలు నమ్మారు. కొంతమంది నమ్మినట్లు నటించి తరవాత నాన్న చాదస్తానికి నవ్వుకున్నారు. మా ఇంటి ఎదురుగా ఉన్న శర్మగారు 'ఈ రోజుతో ఈ ఘటం వెళ్ళిపోతుందోయ్' అని నాన్న చెబుతుంటే గోడ వైపు ముఖం తిప్పుకుని ముసి ముసిగా నవ్వటం తను చూసింది. నాన్న ఇవేమీ పట్టించుకోవటం లేదు. ఎదుటివారు తన మాటలు నమ్ముతున్నారా, లేదా అని చూడటం లేదు. ఆయన ఆత్రత ఆయనది. ఆ రోజు తను చచ్చిపోతున్నాడు. అంతే.

ఎట్లాగో అమ్మ వంట పూర్తిచేసి నాన్నను భోజనానికి పిలిచింది.

''కాముడూ! ఎప్పుడో పెళ్ళయిన కొత్తల్లో కలిసి భోజనం చేసేవాళ్ళం. చాలా ఏళ్ళయింది కదూ మనిద్దరం కలిసి భోజనం చేసి. మళ్ళీ ఈ రోజు నీతో కలిసి భోజనం చెయ్యాలనిపిస్తోంది, కాముడూ, నువ్వుకూడా వడ్డించుకో'' అన్నాడు నాన్న.


విస్తరి మీద నీళ్ళు చల్లుతూంది అమ్మ. నాన్న మాటలు వింటుంటే ఆమెకు దుఃఖం ఆగలేదు. కన్నీటిబొట్లు టపటపా విస్తరిలో పడ్డాయి. ఆ విస్తరి తీసేసి మరో విస్తరి వేసింది.

అమ్మ నాన్నతో కలిసి భోజనానికి కూర్చోదు. నాన్న భోజనం చేసిన తరవాత ఆ విస్తట్లో తను కూర్చుని భోజనం చేస్తుంది. అట్లా భోజనం చేస్తేనే ఆమెకు తృప్తి.

తనకికూడా వడ్డించుకుని, తనకు కూడా కంచం పెట్టింది అమ్మ.

''నువ్వుకూడా రా, లక్ష్మీ!'' పిలిచాడు నాన్న.

తనకు నాన్న పిలుపు వింటే అదోలా ఉంది. ఆ స్వరంలో ఎంతో ఆప్యాయత ఇమిడి ఉంది. ఎంతో అనురాగం, ఆప్యాయతతో మిళితమైన పిలుపు అది. వెళ్ళి పీటమీద కూర్చున్నది.



ముగ్గురూ కూర్చున్నారు.

నాన్నతో కలిసి భోజనం చెయ్యడం అమ్మకు కొత్తగా ఉన్నట్లుంది. పాత జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయేమో ఆమె కనులవెంబడి అశ్రుధారలు. అమ్మను చూస్తుంటే తన కనులుకూడా చెమర్చాయి.

''అమ్మా, లక్ష్మీ! నేను పోయిన తరవాత మీ అమ్మను ఎట్లా చూసుకుంటావో. . . ఏమో. . . మీ అమ్మ బాధ్యత అంతా నీదే. కొడుకువైనా, కూతురువైనా నీవే, తల్లీ! పది వేలు ఇన్సూర్ చేశాను. నువ్వు చదువు మానెయ్యకు. టెస్టు పాసైన తరవాత ఇంటర్‌లో చేరు. తండ్రి లేని బిడ్డలా ఎప్పుడూ అనుకోకు. అన్నిటికీ మీ అమ్మ ఉంది. నీ పెళ్ళి చూసే యోగం నాకు లేదు. ఏం చేస్తాం? ఎంతవరకు ప్రాప్తమో అంతవరకే.''

నాన్న మాటలు వింటుంటే తనకు దుఃఖం ఆగలేదు. నాన్న నాతో అలా చెబుతుంటే అంతా అయోమయంగా ఉంది. అమ్మ సంగతి సరేసరి. తనకు కన్నీళ్ళు ఆగలేదు. పమిటకొంగుతో కళ్ళు వత్తుకుంది. అమ్మ కళ్ళు వర్షిస్తున్నాయి. అన్నం సహించలేదు. ఎట్లా సహిస్తుంది అటువంటి పరిస్థితుల్లో? ఎవ్వరికీ సహించలేదు. ముగ్గురూ అన్నం తినకుండానే చేతులు కడుక్కున్నారు.

సాయంత్రమయేవరకు నాన్న అమ్మకు ఏవో అప్పగింతలు పెడుతూనే ఉన్నాడు. ''కాముడూ! మంచి సంబంధం చూసి లక్ష్మికి పెళ్ళి చెయ్యి. అది చదివినంత వరకు చదివించు. తెలిసిగంది. అక్కడా అక్కడా చిల్లర మల్లర బాకీలు చేశాను. వాటిని తీర్చేయి. ఇంటిని జాగ్రత్తగా చూసుకో. . . నీ మెడలో గొలుసు జానకికి ఇవ్వకు. లక్ష్మికి ఇవ్వు. ఇంకా ఎన్నో. . . ఎన్నెన్నో. . .'' అమ్మ కంటికీ, మంటికీ ఏకధార.

చీకటి పడుతుండగా, ''గుండెల్లో పోటుగా ఉంది, కాముడూ'' అన్నాడు నాన్న.

వెంటనే అమ్మ తనను పిలిచి డాక్టరును పిలుచుకు రమ్మని చెప్పింది.

''ఎందుకు, కాముడూ, డాక్టర్ని పిలవటం? మృత్యువును ఏ డాక్టరూ ఆపలేడు. పోయే ప్రాణం ఎటు తిరిగి పోతుంది. ఇంకా ఈ డాక్టర్లెందుకు? చూశావా, కాముడూ, మృత్యువు ఏ రూపంలో వస్తుందో? ఈ రాత్రి పన్నెండు గంటల లోగా నన్ను తీసుకెళుతుంది.''

నాన్న వేదాంతధోరణి అమ్మ దుఃఖాన్ని ఇనుమడింపచేస్తుంది.

వెళ్ళి డాక్టర్ని పిలుచుకు వచ్చింది తను.

డాక్టరు నాన్నను పరీక్షించి, "ఏం ఫరవాలేదు. తెల్లవారేసరికి తగ్గిపోతుంది. ఈ మందులు వాడండి" అని ఏవో నాలుగు టాబ్లెట్లు ఇచ్చి, ఇంజక్షను చేసి వెళ్ళాడు.

డాక్టరు వెళ్ళిపోతుంటే ఆయనతో వీధి గుమ్మం వరకు వెళ్ళి తను అడిగింది. "డాక్టర్! నాన్నకు ఏమీ ప్రమాదం లేదుగా!"

"లేదమ్మా. కంగారుపడ నవసరం లేదు."

ఆ రాత్రికి అమ్మ వంట చెయ్యలేదు. ఎట్లా చేస్తుంది—నాన్న గుండెపోటుతో బాధ పడుతుంటే.

రాత్రి గడిచే కొద్దీ నాన్నకు గుండెపోటు మరీ ఎక్కువైంది. అమ్మ మనసు మనసులో లేదు. నాన్న వైపు దిగులుగా చూస్తూ ఆయన గుండెల మీద చేతితో రాస్తూ కూర్చుంది.

"కాముడూ!" నీరసంగా పిలిచాడు నాన్న.

ఏమిటన్నట్లు చూసింది అమ్మ నాన్న వైపు.

"అల్లుడికి టెలిగ్రామ్ ఇప్పించు—జానకిని, పిల్లల్ని తీసుకుని రమ్మను."

నూతిలోనుంచి వచ్చినట్లుంది నాన్న స్వరం.

అమ్మ తన వైపు చూసింది.

అర్థం చేసుకున్నట్లు తను బయటకు నడిచింది.

టెలిగ్రాఫ్ ఆఫీసు తమ ఇంటి దగ్గరే. వెళ్ళి బావకు టెలిగ్రామ్ ఇచ్చి వచ్చింది తను. టెలిగ్రామ్ ఎంత త్వరగా అందినా, వాళ్ళు వచ్చేసరికి తెల్లవారుతుంది.


తను వచ్చేసరికి నాన్న కళ్ళు మూసుకుని పడుకున్నాడు. అమ్మ ఆయన వైపు అట్లాగే నిలువుగుడ్లు వేసి చూస్తోంది, గుండెల మీద రాస్తూ.

తనకు తెల్లవారితే పరీక్షలు మొదలవుతాయి. నాన్నే చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే తనకు ఈ పరీక్ష లెందుకూ? చదువు లెందుకూ?

నాన్న పరిస్థితి చూస్తుంటే తనకూ అనుమానంగానే ఉంది—ఆయన బ్రతుకు మీద.

అమ్మతో ఏదో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడు నాన్న. గుండెపోటు మరీ ఎక్కువగా ఉందేమో—మాట్లాడలేక పోతున్నాడు.

టైము చూసింది. పదకొండు గంట లయింది.




నాన్న క్రమంగా నిద్రలోకి జారు కుంటున్నాడు. కళ్ళు మూతలు పడు తున్నాయి. అమ్మకుకూడా కళ్ళు మూతలు పడుతున్నట్లున్నాయి. తనకు తెలీకుండానే నిద్ర పడుతున్నట్లుంది. ఈ పదిహేను రోజులనించీ అమ్మకూ నిద్ర లేదు. అహర్నిశలూ నాన్న గురించే అమ్మ ఆలోచనలు. మనిషి నీరసించిపోయింది. లావుగా ఉండే అమ్మ సన్నగా అయిపోయింది. ముఖంలో జీవకళ తగ్గి పోయింది. అమ్మను చూస్తుంటే జాలి వేసింది. ఏడుపుకూడా వచ్చింది. ఎట్లా ఉండే అమ్మ ఎట్లా తయారయింది?

అప్రయత్నంగా కళ్ళు గడియారం మీదకు వెళ్ళాయి. పదకొండు గంటలు దాటి పది నిమిషాలయింది. నాన్న నమ్మిన జోస్యం ప్రకారం ఇంకా ఈ లోకం వదలటానికి పంతొమ్మిది(?) నిమిషాలు వ్యవధి ఉంది. ఈ తలంపు రాగానే తన గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. ఈ జోస్యం జరగకూడదని, నాన్న బ్రతకాలని మనసు లోనే దేవుణ్ణి వేడుకున్నది.

తనకుకూడా నిద్ర ముంచు కొస్తోంది. ఎంతటి విషమ పరిస్థితులల్లో నైనా ప్రకృతికి విరుద్ధంగా సంచరించ గలగటం కష్టం. అమ్మా, నాన్నల బాధ చూస్తూ తనుకూడా ఈ పదిహేను రోజులనించి సరిగా నిద్ర పోలేదు. కళ్ళు మూతలు పడుతున్నాయి.

మగత నిద్ర పట్టింది.

ఆ నిద్రలో ఏదో కల. ఆ కలలో. . . నాన్న పంచీ చేత పుచ్చుకుని హడావిడిగా స్టేషన్‌లోకి ప్రవేశించాడట. అప్పటికే రైలు బయలుదేరింది. పరిగెత్తుకుంటూ వెళ్ళి నాన్న కదులుతున్న రైలు బోగీ ద్వారపు కడ్డీ దొరక బుచ్చుకోబోయాడు. పట్టు దొరకలేదు. అంతే, మొదటి మెట్టు మీద కాలు పెట్టబోతున్న నాన్న రైలు కింద...ఉలిక్కి పడి కనులు తెరిచింది. ఎదురుగా గోడనున్న గడియారం కనిపిం చింది. పన్నెండు గంటలు దాటుతూంది. చివాలున మంచం మీద నించి లేచి కూర్చుని నాన్న వైపు చూసింది.

"కాముడూ. . . కాముడూ. . ." పెద్దగా పిలుస్తున్నాడు నాన్న.

ఆశ్చర్యమేసింది. అమ్మ పలకలేదు. నాన్న గుండెలమీద తల వాల్చి పడుకుని ఉంది.

"కాముడూ... కాముడూ..," మళ్ళీ పిలిచాడు నాన్న.

". . ."

"లక్ష్మీ!" తనను పిలిచాడు నాన్న.

లేచి తను నాన్న మంచం దగ్గరకు వెళ్ళింది.

"నీ అమ్మను పిలు."

"అమ్మా. . . అమ్మా!"

". . ."

"నాన్నా... అమ్మ పలకటం లేదు." తను భయంగా చెప్పింది.

నాన్న మెల్లిగా లేచి కూర్చుని అమ్మ తలను తన ఒడిలో ఉంచుకుని ముక్కు దగ్గర వేలు ఉంచి శ్వాస ఆడుతూందో, లేదో చూస్తున్నాడు.

తను ఊపిరి పీల్చటం ఆపివేసింది. గుండెల్లో రైళ్ళు పరిగెత్తుతున్నాయి.

ఒక నిమిషం పాటు అట్లాగే చూసి నాన్న అమ్మ ముక్కు దగ్గరినించి వేలు తీసివేస్తూ "కాముడు మనల్ని అన్యాయం చేసి వెళ్ళిపోయింది, లక్ష్మీ!" పెద్దగా ఏడుస్తూ అన్నాడు.

తన గుండె కొట్టుకోవటం ఆగి పోతున్నట్లనిపించింది. [illegible] కదులుతున్నట్లు, [illegible] లో కూరుకుపోతున్నట్లు... అంతా [illegible] [illegible] పోయింది.

'అమ్మ చచ్చిపోయిందా!' గుండెలు పగిలేలా ఏడవాలనిపించింది. కష్టంతో అమ్మను తడిపి వేయాలనిపించింది. నోరు పెగిలి ఏడుపు బయటకు రావటం లేదు. ఎవరో. . . ఏదో అట్టహాసం(?) హాస్యం తన అంకెలను నొక్కివేసిన ట్లనిపించింది.

"నిన్ను నేనే చంపుకున్నాను, కాముడూ, నేనే చంపుకున్నాను. నేను నీ కంటే ముందుగా చనిపోతే నువ్వు విధవగా బ్రతకాలని, నా చేతుల మీదుగా ముందు నువ్వే వచ్చేదు పసుపు కుంకుమలతో ముత్తయిదువుగా పోవాలనుకున్నాను. నీ కోరిక నెరవేర్చుకున్నావు. ఎంత పుణ్యాత్మురాలివి, కాముడూ. ఎంత భాగ్యం నీది! ఎంతమందికి ఇంతటి అదృష్టం! జోస్యాన్ని గుడ్డిగా నమ్మి ఆ నిమిషంలో నేను చచ్చిపోతానని అనుక్షణం నీకు గుర్తు చేస్తూ నిన్ను వేధించాను కాముడూ నీలో భయాన్ని రేకెత్తించాను. అందుకే నువ్వు చచ్చిపోయావు. నాకంటే ముందుగా పోయావు. నువ్వు ముందు పోలేదు, కాముడూ. . . నిన్ను నేనే చంపు కున్నాను. నేను ఎంత దురదృష్టవంతు డిని, కాముడూ, చేతులారా నిన్ను చంపు కున్నాను." పసిపిల్లాడిలా విలపిస్తున్నాడు నాన్న.

'నాన్న మాటలు నిజం. అమ్మ చచ్చి పోలేదు. నాన్న తన మాటలతో ఆమెను చంపాడు. అనుక్షణం వేధించి మరీ చంపాడు. తన జోస్యంతో ఆమెను భయపెట్టి మరీ చంపాడు. ఇదంతా నాన్న చేసిన పనే. ఈ ఘోరం చేసింది నాన్నే. నాన్నా! ఎంత పని చేశావు? చేతులారా అమ్మను చంపావు. నీ చావు జోస్యంతో అమ్మ చావుకు కారణమయ్యావు నీ జోస్యం వల్లనే అమ్మ చచ్చిపోయింది. నీవు గుడ్డిగా నమ్మిన జోస్యమే అమ్మను చంపింది. నీవే చంపావు, నాన్నా. అమ్మను నీవే చంపావు.' తన కనుల వెంట కన్నీరు ధారలుగా ప్రవహిస్తూంది. గుండెలు పగిలిపోతున్నాయి. భూమి గిర్రున తిరుగుతూంది.

ఎప్పటికో తన నోరు పెగిలింది. అంతే. . . "అమ్మా" అంటూ ఒక్కసారి మొదలు నరికిన చెట్టులా నాన్న జోస్యానికి బలైపోయిన అమ్మ మీదకు ఒరిగి పోయింది.

★